# బ్లాక్‌బాక్స్ లభ్యం

- హాస్టల్ భవనం పైకప్పు మీద ఏటీఎస్ బృందాలకు లభ్యం
- దర్యాప్తులో కీలకం కానున్న బ్లాక్‌బాక్స్ సమాచారం



అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ), గుజరాత్ ఉగ్రవాద వ్యతిరేక దళం(ఏటీఎస్) అధికారులకు బ్లాక్‌బాక్స్, డిజిటల్ వీడియో రికార్డర్స్ లభ్యమయ్యాయి. ఈ మేరకు పౌరవిమానయాన శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రమాద స్థలంలో రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ భవనం పైకప్పు మీద విమాన శకలాలలో బ్లాక్‌బాక్స్ దొరికిందని పేర్కొంది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడంలో బ్లాక్‌బాక్స్ కీలకం కానుంది. సాధారణంగా విమానం తోక భాగంలో బ్లాక్‌బాక్స్‌ను అమర్చుతారు. ప్రమాదాల్లో పేలుడు ద్వారా ఉత్పన్నమయ్యే మంటల తట్టుకునేలా, 1100 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద గంటపాటు ఉన్నా ధ్వంసం కాకుండా వీటిని రూపొందిస్తారు. ఇందులో విమానానికి సంబంధించిన ఫ్లైట్ డాటా రికార్డర్(ఎఫ్‌డీఆర్) వంటి సాంకేతిక సమాచారం, కాక్‌పిట్ వాయిస్ రికార్డర్(సీవీఆర్) సంభాషణల సారాంశం నిక్షిప్తమై ఉంటుంది. ఇందులో విమానంలోని ఇద్దరు పైలట్‌ల మాటలు రికార్డవుతాయి. ప్రమాదానికి ముందు వారు ఏం మాట్లాడుకున్నారనేది తెలిస్తే దర్యాప్తు సులభమవుతుంది. బ్లాక్‌బాక్స్ పక్కనే డీవీఆర్‌లు ఉంటాయి. విమానంలోని సీసీటీవీ కెమెరాల ద్వారా రికార్డయిన దృశ్యాలు ఇందులో ఉంటాయి. బ్లాక్‌బాక్స్, డీవీఆర్‌లోని డాటాని ఫోరెన్సిక్ బృందాలు విశ్లేషిస్తాయి. ఇందులోని సమాచార వివరాలు దర్యాప్తులో కీలక ఆధారాలుగా నిలుస్తాయి. గుజరాత్ ప్రభుత్వానికి చెందిన 40 మంది అధికారులు దర్యాప్తులో భాగస్వాములవుతున్నారని పౌరవిమానయాన శాఖ తెలిపింది. విమానం 29 నిమిషాలు ఆలస్యంగా బయల్దేరడం, గాల్లోకి ఎగరడానికి మొత్తం రన్‌వేను ఉపయోగించుకోవాల్సి రావడం వంటి అంశాలు విమాన పనితీరుపై సందేహాలు కలిగిస్తున్నదని అంటున్నారు.



## ఘటనాస్థలిని పరిశీలించిన మోదీ

**దవాఖానలో క్షతగాత్రులకు పరామర్శ**

అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 265 మందిని బలిగొన్న విమానం కూలిపోయిన ప్రదేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం పరిశీలించి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. శుక్రవారం ఉదయం సర్దార్ వల్లభాయ్ పటేల్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని మోదీ నేరుగా విమానం కూలిపోయిన ప్రదేశానికి వెళ్లారు. ఘటనా స్థలిని 20 నిమిషాల సేపు ఆయన పరిశీలించారు. మెడికల్ కాలేజీ హాస్టల్, మెస్సుపై విమానం కూలిపోయిన వివరాలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు, గుజరాత్ హోం మంత్రి హర్ష్ సంఘవి ప్రధానికి వివరించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానను సందర్శించిన మోదీ ప్రమాదంలో ఏకైక మృత్యుంజయుడు విశ్వాస్ కుమార్ రమేశ్‌ని పరామర్శించారు.

## విమాన పేలుడుతో 1000 డిగ్రీల ఉష్ణోగ్రత

- ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం
- విమానం కూలిన వెంటనే అంటుకున్న ఫ్యూయెల్
- ఆ వేడి నుంచి శునకాలు, పక్షులు కూడా తప్పించుకోవడం అసాధ్యం

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమాన ప్రమాదం దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. వందల కుటుంబాల్లో కల్లోలం నింపింది. విమానం కూలిపోయి పేలుడు సంభవించిన తర్వాత అక్కడ ఉష్ణోగ్రత ఏకంగా 1000 డిగ్రీలకు చేరుకుంది. ఈ కారణంగానే సహాయక కార్యక్రమాలు ఆలస్యమయ్యాయని అధికారులు తెలిపారు. అంత ఉష్ణోగ్రత నుంచి మనుషులే కాదు, చివరికి శునకాలు, పక్షులు కూడా తప్పించుకోలేవని పేర్కొన్నారు. అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో గురువారం మధ్యాహ్నం లండన్ బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉన్నదని, అది అంటుకోవడంతో ఎవరినీ రక్షించే అవకాశం లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. విమానం కూలిన బీజే మెడికల్ కాలేజీ వద్దకు తమ సిబ్బంది 2-2.30 గంటల మధ్యలో చేరుకున్నారని, అయితే, అప్పటికే స్థానికులు కొందరిని రక్షించి బయటకు తీసుకొచ్చారని ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు తెలిపారు. కానీ, తమ దళాలు మాత్రం లోపలికి వెళ్లలేకపోయాయని, ఒక్కరినీ కూడా రక్షించలేకపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. విమానం పేలిన వెంటనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీలకు చేరుకోవడంతో ఎవరూ తప్పించుకునే అవకాశం లేకుండా పోయిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు. తాను గతంలోనూ ఇలాంటి సంక్షోభాలు చూశానని, కానీ ఇలాంటి విపత్తును చూడటం మాత్రం ఇదే తొలిసారని అధికారి ఒకరు తెలిపారు.


## డీఎన్ఏకు 72 గంటలు

**తర్వాతే మృతదేహాల అప్పగింత**


అహ్మదాబాద్: విమాన ప్రమాద మృతులను గుర్తించడానికి వారి బంధువుల నుంచి డీఎన్ఏ సేకరించామని, ఆ నమూనాలను సరిపోల్చడానికి 72 గంటల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు. అది గుర్తించిన వెంటనే మృతదేహాలను వారి వారి బంధువులకు అప్పగించే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటివరకు గుర్తించిన ఆరు మృత దేహాలను వారికుటుంబ సభ్యులకు అందజేసినట్టు పోలీసులు తెలిపారు. గురువారం పోస్ట్‌మార్గం నిమిత్తం 265 మృతదేహాలువచ్చాయన్నారు.

# విమానం ఎందుకు కూలింది?

- ఎయిరిండియా దుర్ఘటనపై పలు ఊహాగానాలు
- పక్షుల ఢీ, ఇంజిన్ ఫెయిల్యూర్, హెవీ లోడ్ ఫ్లాప్స్‌లో సమస్యలు కావొచ్చంటున్న నిపుణులు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): గుజరాత్‌లో ఎయిరిండియా విమానం కూలిన ఘటనలో 241 మంది మృత్యువాతపడ్డారు. ఈ క్రమంలో విమాన ప్రమాదానికి కారణాలు ఏమై ఉండొచ్చన్న చర్చ మొదలైంది. విమానయాన రంగంలో అనుభవమున్న పలువురు నిపుణులు ఎయిరిండియా విమానానికి ప్రధానంగా 4 కారణాలను చెప్తున్నారు.








**పక్షులు ఢీకొనడం-ఇంజిన్‌కు పవర్ కట్**
ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పక్షులు విమానాన్ని ఢీకొట్టడం సాధారణంగా జరుగుతుందని మాజీ పైలట్ సౌరభ్ భాట్‌నగర్ అన్నారు. ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం విషయంలోనూ ఇదే జరుగొచ్చని అభిప్రాయపడ్డారు. పక్షులు ఢీకొట్టడంతో సాంకేతిక సమస్య ఎదురై రెండు ఇంజిన్లకు పవర్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఉండొచ్చని అనుమానించారు. దీంతో అప్పటివరకూ లిఫ్టింగ్ పొజిషన్‌లోకి వెళ్లిన విమానం ఉన్నట్టుండి కిందికి దూసుకొచ్చిందని ఆయన గుర్తుచేస్తున్నారు.

**ఓవర్ లోడ్-థ్రస్ట్ ఫోర్సెస్?**
ప్రమాదానికి గురైన విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉన్నట్టు హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ప్యాసింజర్లతో పాటు క్యాబిన్ లగేజీ, చెకిన్ బ్యాగేజీ వీటికి అదనం. పైగా వేసవి కావడంతో విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో గాలిలో తేమ శాతం తక్కువగా ఉన్నట్టు చెప్తున్నారు. ఈ కారణంగా గాలిలోకి ఎగిరాక థ్రస్ట్ (ముందుకు నెట్టేయడం) ఫోర్సెస్ ఎలా పనిచేశాయి? టేకాఫ్‌కు అవసరమైన స్పీడ్‌ను విమానం అందుకొందా? అనేవి కూడా ముఖ్యమేనని విమానయాన రంగ నిపుణుడు ప్రొఫెసర్ మెక్‌డెర్మిడ్ అభిప్రాయపడ్డారు.

**ఫ్లాప్స్ సరిగ్గా తెరుచుకొన్నాయా?**
రన్‌వే మీద నుంచి విమానం పైకి ఎగురాలంటే రెక్కల మీద ఉండే 'ఫ్లాప్స్' సరిగ్గా తెరుచుకోవాలని అమెరికాకు చెందిన ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ చెబుతున్నారు. ఒకవేళ, ఫ్లాప్స్ సరిగ్గా తెరుచుకోకపోయినా, అవి సరైన పొజిషన్‌లో ఉండకపోయినా.. విమానం సరైన సమయంలో తగిన ఎత్తును అందుకోలేదని అంటున్నారు. ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఫ్లాప్స్ సమస్య ఎదురయినట్టు తనకు అనిపిస్తున్నదని జాన్ పేర్కొన్నారు.

**ల్యాండింగ్ గేర్‌లో సమస్య?**
విమానం టేకాఫ్ అయ్యి.. నిర్ణీత ఎత్తును అందుకొన్నాక ల్యాండింగ్ గేర్లు విమానంలోపలికి వెళ్తాయి. అయితే, ఎయిరిండియా విమానం 825 అడుగుల ఎత్తులోకి వెళ్లాక కూడా ల్యాండింగ్ గేర్లు లోపలికి వెళ్లకపోవడం అనుమానాలను కలిగిస్తున్నదని మాజీ పైలట్ ఈశాన్ ఖలీద్ అన్నారు. ఇంజిన్‌లో సమస్య ఉంటేనే ఇలా జరుగుతుందని చెప్పారు. కల్తీ ఫ్యూయెల్‌ను వాడితే కూడా ఇంజిన్‌లో సమస్యలు ఎదురయ్యే ప్రమాదమున్నదని ఎయిరిండియా మాజీ అధికారి కెప్టెన్ మనోజ్ హాతీ తెలిపారు. ఏదిఏమైనా.. బ్లాక్‌బాక్స్‌లోని డేటాను విశ్లేషించిన తర్వాతే, విమాన ప్రమాదానికి అసలు కారణమేంటో తెలిసే అవకాశం ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఇరాన్, ఇజ్రాయెల్ సంయమనం పాటించాలి

**భారత్ విజ్ఞప్తి**

న్యూఢిల్లీ: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తాజా పరిణామాల పట్ల భారత దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఉద్రిక్తతలను పెంచే చర్యలను నివారించాలని ఇరు దేశాలను కోరింది. ఈ ప్రాంతంలోని భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికారుల సలహాలను పాటించాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్‌లోని అణ్వాయుధ, క్షిపణి, సైనిక కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఈ ప్రకటనను శుక్రవారం విడుదల చేసింది.

## ప్రధాని మోదీకి నెతన్యాహు ఫోన్

జెరూసలెం: ఇరాన్‌పై దాడులకు అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రపంచ దేశాల నేతలతో మాట్లాడుతున్నారు. నెతన్యాహూ గురువారం రాత్రి నుంచి వివిధ దేశాల నేతలతో మాట్లాడుతున్నారు. ప్రధాని మోదీ, జర్మన్ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రన్ తదితరులతో మాట్లాడారు. ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌కు ఎదురవుతున్న ముప్పును ఈ నేతలు అర్థం చేసుకున్నట్లు నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ నెతన్యాహూ మాట్లాడతారని చెప్పింది.

## 16 ఎయిరిండియా విమానాల దారిమళ్లింపు

ముంబై: సుదూర ప్రాంతాలకు వెళ్లే 16 విమానాలను ఎయిరిండియా శుక్రవారం దారి మళ్లించింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ గగనతలం మూసివేత నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎయిరిండియా విడుదల చేసిన ట్రావెల్ అడ్వయిజరీలో, ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపింది. కొన్ని విమానాలను దారి మళ్లించినట్లు, మరికొన్ని అవి బయల్దేరిన విమానాశ్రయానికి తిరిగి చేరుకుంటాయని వెల్లడించింది. తమ విమాన సమయాల్లో మార్పులు ఉంటాయని ఇండిగో తెలిపింది.

# మరో యుద్ధం



ఇజ్రాయెల్ దాడుల్లో హతమైన ఇరాన్ అగ్రనేతలు హొస్సేన్ సలామీ, అలీ షామ్‌ఖానీ, బాఘేరి

> మొదటిపేజీ తరువాయి...

దాడులను ఎదుర్కోవడం ఇరాన్‌కు ఇదే మొదటిసారి. ఈ దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల ప్రధాన అధికారి జనరల్ మొహమ్మద్ బాఘేరి, రెవెల్యూషనరీ గార్డ్స్ జనరల్ హొస్సేన్ సలామీ, ఖండాంతర క్షిపణి కార్యక్రమం అధికారి జనరల్ అమీర్ అలీ హాజీజాదే, ఖమేనీ సన్నిహితుడు అలీ షామ్‌ఖానీ, పలువురు శాస్త్రవేత్తలు, ఉన్నతాధికారులు మృతి చెందారు. ఇరాన్ సైతం వెంటనే ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌పైకి వందకుపైగా డ్రోన్‌లను ప్రయోగించింది. ఇజ్రాయెల్‌కు 'తీవ్రమైన శిక్ష' తప్పదు అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను పలు దేశాలు ఖండించాయి. వెంటనే ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఉభయ దేశాలు ప్రయత్నించాలని ప్రపంచ నాయకులు పిలుపునిచ్చారు. ఇరాన్ అణు కార్యక్రమంపై అట్టుడుకుతున్న అమెరికా, ఇజ్రాయెల్‌లు ఎప్పటి నుంచి దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నాయి. పశ్చిమాసియా ప్రమాదకరంగా మారవచ్చని వ్యాఖ్యానించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనిక కుటుంబాలను, దౌత్య సిబ్బందిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇరాన్ అణు కార్యక్రమాన్ని అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు.

**టార్గెట్లు ఛిన్నాభిన్నం**
దాదాపు 200 యుద్ధ విమానాలు ఇరాన్‌లోని 100కుపైగా లక్ష్యాలపై దాడులు చేశాయని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇక ఇరాన్‌లోనే తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్న ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ అక్కడి నుంచే టెహ్రాన్‌కు సమీపంలోని మిస్సైల్ లాంచర్లపై దాడులు చేసినట్టు తెలిపింది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగల ఆయుధాలను, వాహనాలపై నుంచి దాడులు చేసే వ్యవస్థను సెంట్రల్ ఇరాన్‌కు ఇంతకుముందే రహస్యంగా తరలించామని తెలిపింది. ఇక్కడి నుంచే ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థపై దాడి చేశామని పేర్కొంది.

**నతాంజ్ అణుకేంద్రం ధ్వంసం**
ఇజ్రాయెల్ దాడుల్లో నతాంజ్ ప్రాంతంలోని ఇరాన్ ప్రధాన అణుశుద్ధి కేంద్రం దెబ్బతిన్నట్టు తెలిసింది. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున నల్లటి పొగ రావటం చూశామని స్థానికులు చెప్పారు. ఈ కేంద్రంలో ఆరుగురు అణు శాస్త్రవేత్తలు మృతిచెందినట్టు సమాచారం. పశ్చిమ ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలను డజన్ల కొద్దీ రాడార్ కేంద్రాలను ధ్వంసం చేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ దాడుల్లో ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కీలక నాయకత్వం మొత్తం తుడిచిపెట్టుకుపోయినట్టు సమాచారం. రెవెల్యూషనరీ గార్డ్స్ కీలక నాయకత్వం ఓ భూగర్భ బంకర్‌లో సమావేశం నిర్వహిస్తుండగా, తాము దాడి చేశామని దీంతో అందరూ మరణించారని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ వెల్లడించారు. ఇరాన్ వెంటనే ప్రతీకార దాడులకు దిగుతూ ఇజ్రాయెల్‌పైకి 100కు పైగా డ్రోన్‌లను పంపింది. అవన్నీ ఇరాక్, జోర్డాన్ గగనతలం నుంచి వెళ్లినట్టు ఆయా దేశాల అధికారులు వెల్లడించారు. అయితే ఆ డ్రోన్‌లను తమ గగనతలం వెలుపలనే అడ్డుకున్నామని ఇజ్రాయెల్ తెలిపింది.

**ఇప్పటికైనా దిగిరండి : ట్రంప్**
అణు కార్యక్రమం విషయంలో ఇరాన్ ఇప్పటికైనా తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఒక ప్రకటన చేస్తూ.. 'ఇజ్రాయెల్ దాడులు మరింత ఉధృతమవుతాయి' అని హెచ్చరించారు. 'ఈ మారణహోమాన్ని ఆపడానికి ఇంకా సమయం ఉంది, తదుపరి జరుగబోయే దాడులు మరింత క్రూరంగా ఉంటాయి. అంతా నేలమట్టం కాకముందే ఇరాన్ ఒప్పందం చేసుకోవాలి. ఒకప్పుడు ఇరాన్ సామ్రాజ్యంగా పేరొందిన ప్రదేశాన్ని కాపాడుకోవాలి. మరణాలు వద్దు, విధ్వంసం వద్దు. ఇంకా ఆలస్యం కాకముందే వచ్చి ఒప్పందం చేసుకోండి' అని రాసుకొచ్చారు. ఇజ్రాయెల్ జరిపిన దాడులతో తమకు సంబంధం లేదని అమెరికా పేర్కొంది. ఇరాన్ జరిపే ప్రతీకార దాడుల్లో అమెరికా పౌరులు, ప్రయోజనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

**ఇరాన్ ముప్పును తొలగిస్తాం: నెతన్యాహూ**
ఇరాన్ అణు ముప్పును నిర్మూలించడం తమకు తప్పనిసరి అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ అన్నారు. ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకే 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని తెలిపారు. ఇందుకు తమకు ఒక ఏడాది లేదా కొన్ని నెలలు పట్టవచ్చు అని చెప్పారు. ఇజ్రాయెల్ మనుగడకు ఇరాన్ అణు కార్యక్రమం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. అందుకే ఆ దేశ అణు కార్యక్రమానికి గుండె లాంటి ప్రదేశాన్ని ధ్వంసం చేశామని చెప్పారు. తన యుద్ధం ఇరాన్ ప్రజలతో కాదని అన్నారు. 'గత 46 ఏండ్లుగా మిమ్ములను తొక్కి ఉంచుతున్న క్రూర నియంతలకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. మీ విమోచన దినం దగ్గరలోనే ఉంది' అని పేర్కొన్నారు. ఏడాది కాలంగా ఇజ్రాయెల్ ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థపై దాడులు చేస్తున్నది. గత ఏడాది ఏప్రిల్‌లో రష్యన్ తయారీ గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసింది. అక్టోబర్‌లో క్షిపణి తయారీ, ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేసింది.

**ఇక చర్చల్లేవు: ఇరాన్**
అమెరికాతో జరుగుతున్న అణు చర్చల నుంచి వైదొలగుతున్నామని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దాడులు చేసిందని, దానికి కఠిన శిక్ష విధిస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ ప్రకటించారు.

## ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు

**థాయ్‌లాండ్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్**

న్యూఢిల్లీ: థాయ్‌లాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీకి శుక్రవారం బయల్దేరిన ఎయిరిండియా ఏఐ 379 విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో బయల్దేరిన కాసేపటికే ఈ విమానాన్ని అత్యవసరంగా దించేశారు. దీనిలోని మొత్తం 156 మంది ప్రయాణికులు సురక్షితంగా క్రిందికి దిగిపోయారు. అనంతరం విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. దీనిలో పేలుడు పదార్థాలు లేవని తేల్చారు.



వాయుసేన అపాచీ ఎటాక్ హెలికాప్టర్‌ను శుక్రవారం ఓ పొలంలో దించేశారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరం నుంచి ఇది బయల్దేరింది. ముందు జాగ్రత్త చర్యగా దీనిని పఠాన్‌కోట్ జిల్లాలో కిందకు దించేశారు. రోజువారీ విన్యాసాలు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. దీనిలోని పైలట్, కో పైలట్ క్షేమంగా ఉన్నారు.

## డ్రీమ్‌లైనర్ విమానాలకు అదనపు తనిఖీలు

**ఎయిరిండియాకు డీజీసీఏ ఆదేశం**

*న్యూఢిల్లీ, జూన్ 13: అహ్మదాబాద్‌లో గురువారం విమాన ప్రమాదం జరిగి 241 మంది మరణించిన దరిమిలా ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతా తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్స్(డీజీసీఏ) శుక్రవారం ఆదేశించింది. టాటా గ్రూపు యాజమాన్యంలోని ఎయిరిండియాకు చెందిన 787 డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతా తనిఖీలో వివిధ వ్యవస్థల తనిఖీలు, టేకాఫ్ పరిమితులు మొదలైనవి ఉంటాయి. ఎయిరిండియా వద్ద 26 బోయింగ్ 787-8 విమానాలు, 7 బోయింగ్ 787-9 విమానాలు ఉన్నాయి. జీఈఎన్ఎక్స్ ఇంజిన్లతో నడిచే 787-8, 787-9 బోయింగ్ విమానాలకు తక్షణమే అదనపు నిర్వహణా చర్యలు చేపట్టాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది.లండన్ గాట్విక్ వెళుతున్న ఎయిరిండియా బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం గురువారం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కూలిపోగా అందులోని 242 ప్రయాణికులలో ఒకరు తప్ప మిగిలిన అందరూ మరణించారు. జూన్ 15వ తేదీ నుంచి వివిధ ఒన్-టైమ్ చెకింగ్‌లు బోయింగ్ 787 విమానాలకు నిర్వహించాలని ఎయిరిండియాను డీజీసీఏ ఆదేశించింది. వీటిలో ఇంధన పరిమితుల పర్యవేక్షణ, సంబంధిత వ్యవస్థల తనిఖీలు ఉంటాయి. ఎయిర్ కంప్రెషర్, సంబంధిత వ్యవస్థల తనిఖీ, ఇంజిన్ డ్రైవెన్ యాక్చుయేటర్-ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్ చెక్ కూడా నిర్వహించాలని డీజీసీఏ ఆదేశించింది. ఈ తనిఖీలు, పరీక్షల నివేదికను సమీక్ష నిమిత్తం తమకు సమర్పించాలని డీజీసీఏ కోరింది. కాగా, జీఈఎన్ఎక్స్ ఇంజిన్లను జీఈ ఏరోస్పేస్ తయారు చేస్తున్నది.*

## దేశంలో డ్రీమ్‌లైనర్ విమానాల రద్దు?

**కేంద్రం పరిశీలన**

*న్యూఢిల్లీ, జూన్ 13: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు సాగుతున్న సందర్భంగా దేశంలో బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాలను రద్దు చేసే విషయాన్ని భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. బోయింగ్ 787-8/9 డ్రీమ్‌లైనర్ విమానాల అదనపు తనిఖీకి డీజీసీఏ శుక్రవారం ఎయిరిండియాను ఆదేశించిన నేపథ్యంలో వీటిని తాత్కాలికంగా నిలిపివేసే అంశం పరిశీలనలోకి వచ్చినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఎయిరిండియా వద్ద 26 బోయింగ్ 787-8 విమానాలు, 7 787-9 విమానాలు ఉన్నాయి. ఇలా ఉండగా వచ్చే వారం పారిస్‌లో జరిగే ఎయిర్ షో పర్యటనను బోయింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కెల్లీ ఆర్టెర్గ్ రద్దు చేసుకున్నారు. డ్రీమ్‌లైనర్ కూలిపోయిన ఘటనకు సంబంధించిన దర్యాప్తుపై దృష్టి సారించాలని ఆయన భావిస్తున్నట్లు ఏఎఫ్‌పీ వార్తా సంస్థ తెలిపింది. బోయింగ్ సంస్థ తయారుచేసే విమానాల భద్రత, నాణ్యతపై ప్రస్తుతం ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అహ్మదాబాద్ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్న భారత ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోకు కూడా బోయింగ్ సహకరిస్తోందని కెల్లీ ఆర్టెర్గ్ తెలిపారు.*

# ఇరాన్‌పై ఇప్పుడే దాడి ఎందుకు?

**'అణు'భయాలతోనే ఇజ్రాయెల్ దాడులు.. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య 5 దశాబ్దాల వైరం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇరాన్‌లోని అణు కేంద్రాలు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడులతో పశ్చిమాసియా అట్టుడుకిపోతున్నది. ఇజ్రాయెల్ ఇప్పటికిప్పుడు ఈ దాడులు చేయడానికి కారణం ఇరాన్ నిర్వహిస్తున్న 'అణు కార్యక్రమమే'నని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రోజుల వ్యవధిలో ఇరాన్ 15 అణుబాంబులను తయారు చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నదని, ఇప్పటికిప్పుడు తొమ్మిది అణ్వాయుధాలను ఏర్పాటుచేయగల యూరేనియం నిల్వలు ఆ దేశంలో ఉన్నట్టు ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ వర్గాలు చెప్తున్నాయి. ఇది తమ దేశ అస్తిత్వానికే ప్రమాదమని ఇజ్రాయెల్ భావించింది. పైగా అణు కార్యక్రమంపై ఓ ఒప్పందానికి రావాలంటున్న అమెరికా ప్రతిపాదనలను కూడా ఇరాన్ పట్టించుకోవట్లేదు. దీంతో ఇరాన్ 'అణు' సామర్థ్యాన్ని దెబ్బతీయాలన్న లక్ష్యంతోనే ఇజ్రాయెల్ ఇప్పటికిప్పుడు ఈ దాడులకు పాల్పడినట్టు అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**5 దశాబ్దాల నాటి వైరం!**
ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం ఈనాటిది కాదు. దాదాపు అర్ధ శతాబ్దం క్రితమే ఈ రెండు దేశాల మధ్య వైరం ప్రారంభమైంది. గతంలో అమెరికాతో జతకట్టిన పహ్లవీ రాజవంశం 1979లో ఇరాన్ ఇస్లామిక్ విప్లవంతో అధికార పీఠాన్ని కోల్పోయింది. అనంతరం ఇరాన్ పాలనా పగ్గాలను చేపట్టిన అయతుల్లా ఖమేనీ వర్గం అమెరికా పట్ల ద్వేషంతో మెలగసాగింది. నాటి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం క్రమంగా పెరిగింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తున్నదని ఖమేనీ ఆరోపిస్తూ వస్తున్నారు. దీంతో దశాబ్దాల నుంచే రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. కానీ, ఆ దాడుల్లో తమ ప్రమేయం లేదని రెండు దేశాలు ఖండించడంతో ఈ సంఘర్షణను 'షాడో వార్' అని పిలవడం మొదలుపెట్టారు.

